సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం ၊ 4 ၊ మార్చి ၊ 2024



సోమశిలలో 15.838 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 15.838 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,350 కూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.65,540
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,886
3శాతం జీఎస్టీతో	రూ.6,063
నవర (8గ్రా)	రూ.48,504

గరిష్టం/కనిష్టం
34.6 /24.9

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 60 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. సోమవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

రేపు నూతన జేసీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(దర్గామిట్ట): నూతన జాయింట్ కలెక్టర్‌గా సేతు మాధవన్ మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఏపీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌గా ఉన్న ఆయన ఇటీవల నూతన జేసీగా నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ జేసీగా ఉన్న ఆదర్శ్ రాజేంద్రన్ బదిలీ అయిన విషయం తెలిసిందే.

వెబ్‌సైట్‌లో పదో తరగతి హాల్‌టికెట్లు

నెల్లూరు(టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి విద్యార్థుల హాల్‌టికెట్లు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రైవేట్ విద్యార్థులు కూడా స్ట్రీమ్, జిల్లా, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టినతేదీని సబ్మిట్ చేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

మూలస్థానేశ్వరుని బ్రహ్మోత్సవాల అంకురార్పణ



బ్రహ్మోత్సవాల అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


నెల్లూరు(బృందావనం):నగరంలోని మూలాపేట భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి అంకురార్పణ పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా జరిగిన ఈ పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. జి.రామచంద్రరావు, సీతమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమాలను ఆ దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి, కార్యనిర్వహణాధికారి ఆరంబాకం వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం




కల్యాణోత్సవంలో ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న గుండ్రా సతీష్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భారత రక్షణశాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి, ఆయన సోదరుడు శ్రీనివాసులురెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల చర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర మహిమ చారిటబుల్ ట్రస్ట్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఎస్పీ తిరుమలేశ్వర రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి స్వామివార్లకు రూ.2 లక్షలు చదివింపులు చేశారు. ప్రధానార్చకుడు వాకాణి మారుతి కృష్ణమాచార్యులు, బ్రహ్మశ్రీ వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు నిర్వహించిన గ్రామోత్సవంలో పరిసర గ్రామాలకు చెందిన అశేష భక్తజనం పాల్గొని తరించారు. కార్యక్రమానికి శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు సురేంద్రరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఆత్మకూరు అధ్యక్షుడు చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.



ఉత్సవమూర్తుల చర ప్రతిష్ఠకు హాజరైన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

పేదల వైద్యానికి పెద్దపీట



- పెద్దాస్పత్రిలో అదనపు సౌకర్యాలు
- రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్
- మరో 50 పడకల పెంపు
- అత్యాధునిక ల్యాబ్, మెటర్నిటీ, ఎమర్జెన్సీ వార్డుల ఏర్పాటు
- శరవేగంగా భవన నిర్మాణ పనులు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్కారు ఆస్పత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది, పరికరాల కొరత వేధిస్తుండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వసతులు కల్పించడంతోపాటు అత్యాధునిక వైద్య పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు, మెషినరీ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం నెల్లూరు జీజీహెచ్‌లో కూడా కోట్లాది రూపాయల నిధులతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది.

నెల్లూరు(అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల వైద్యానికి పెద్దపీట వేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించింది. నెల్లూరు దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్)లో రోగులు నాణ్యమైన వైద్యసేవలు పొందేలా చర్యలు తీసుకుంది. ఇందుకోసం రూ.23.75 కోట్లు మంజూరు చేసి క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టింది. జూలై నాటికి పనులన్నీ పూర్తి చేసి వైద్యసౌకర్యాలను అందుబాటులోకి తెచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

అధునాతన వసతులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించేలా గతేడాది పెద్దాస్పత్రికి క్రిటికల్ కేర్ యూనిట్‌ను మంజూరు చేశారు. అధునాతన వసతులతో మూడు అంతస్తులు నిర్మించేలా ప్రణాళికను సిద్ధం చేసి టెండర్లు పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ 15 నెలల్లో పనులు పూర్తి చేసేలా గతేడాది మార్చి 23వ తేదీన ప్రభుత్వంతో అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు (ఏపీఎంఎస్ఐడీసీ) అప్పగించింది. అందులో భాగంగా పెద్దాస్పత్రిలో శరవేగంగా పనులు జరుగుతున్నాయి. కాగా ఇందులో రూ.11.5 కోట్లతో సివిల్ పనులు జరుగుతున్నాయి. మిగతా రూ.12.2 కోట్లతో రోగులకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు, మెషినరీ లాంటివి సిద్ధం చేస్తున్నారు.



పెద్దాస్పత్రి ఆవరణలో నిర్మిస్తున్న సీసీయూ భవనాలు

మరో 50 పడకల ఏర్పాటు

పెద్దాస్పత్రిలో రోజుకు సరాసరి 1,200 నుంచి 1,500 మంది ఔట్ పేషెంట్లు వస్తున్నారు. 500 నుంచి 550 వరకు ఇన్ పేషెంట్లు అడ్మిషన్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం 750 పడకలతో ఆస్పత్రి నడుస్తోంది. అయితే ఆస్పత్రికి వచ్చే రోగులు ఎక్కువవుతుండడంతో ఒక్కో దఫా బెడ్‌లు చాలడం లేదు. దీంతో ప్రస్తుతం నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్‌లో మరో 50 పడకలను సిద్ధం చేయనున్నారు. ఐసీయూలో 10 పడకలు, హెచ్‌డీయూలో 6, ఒక ఐసోలేషన్ వార్డులో 24, మరో ఐసోలేషన్ వార్డులో 2, డయాలిసిస్ కేంద్రంలో 2, ప్రసూతి విభాగంలో 2, ఇంకో ఎమర్జెన్సీ వార్డులో 4 బెడ్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణం పూర్తయితే రోగులకు మరిన్ని నాణ్యమైన వైద్యసేవలు అందుతాయని డాక్టర్లు పేర్కొంటున్నారు.

జూలై నాటికి పనులన్నీ పూర్తి



పెద్దాస్పత్రిలో పెరుగుతున్న రోగులకు అనుగుణంగా సౌకర్యాలు పెంచేందుకు ప్రభుత్వం క్రిటికల్ కేర్ యూనిట్‌ను మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు చకచకా జరుగుతున్నాయి. జూలై నాటికి పనులన్నీ పూర్తి చేసి వైద్యసౌకర్యాలను అందుబాటులోకి తెస్తాం.
– సుధాకర్‌గౌడ్, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

మూడు అంతస్తుల్లో..

నూతనంగా నిర్మిస్తున్న మూడు అంతస్తుల భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌ను 15,930.70 చదరపు అడుగుల్లో, మొదటి అంతస్తును 15,930.70 చదరపు అడుగుల్లో నిర్మిస్తున్నారు. రెండో అంతస్తును 14,343 చదరపు అడుగుల్లో నిర్మిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎమెర్జెన్సీ వార్డుతోపాటు 2 ఐసోలేషన్ వార్డులను, కాన్పుల కోసం ప్రసూతి వార్డును, ఎక్స్‌రే గదిని, అల్ట్రాసౌండ్ రూమును, లేబర్ రూమును ఏర్పాటు చేస్తున్నారు. రోగులకు అందాల్సిన అత్యవసర వైద్యసేవలను బట్టి గ్రీన్, రెడ్, ఎల్లో జోన్‌లను సిద్ధం చేస్తున్నారు. మొదటి అంతస్తులో మహిళలకు, పురుషులకు వేర్వేరుగా ఐసోలేషన్ వార్డులను, కిడ్నీ రోగులకు డయాలసిస్ గదిని నిర్మిస్తున్నారు. రెండో అంతస్తులో ఐసీయూను, పోస్ట్ ఆపరేటివ్ హాలును, ప్రీ ఆపరేటివ్ హాలును నిర్మిస్తున్నారు. రెండు ఆధునిక ఆపరేషన్ థియేటర్లు సిద్ధం చేస్తున్నారు.

పోలియో రహిత సమాజం కోసం కృషి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(అర్బన్): పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచించారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక పొదలకూరురోడ్డులోని జేవీఆర్ కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ప్రారంభించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలియో రహిత సమాజమే లక్ష్యంగా దేశంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు మరికొంతకాలం చిన్నారులకు పోలియో టీకాలు వేస్తే ఇక భారత్‌లో పోలియో కేసులు శాశ్వతంగా కనిపించవన్నారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో చిన్నారులకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఐదేళ్ల లోపు ఉన్న 2,93,536 మంది పిల్లలందరికీ 100 శాతం వ్యాక్సిన్ వేసేలా వైద్యశాఖ అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. బూత్‌ల వద్దకు రాని చిన్నారులకు సిబ్బంది మరో మూడు రోజులపాటు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సెలీనాకుమారి, డాక్టర్లు మౌనిక, రమేష్, కుసుమ, డెమో అధికారి శ్రీనివాసరావు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ హరినారాయణన్

పల్స్‌పోలియో విజయవంతం

- జిల్లాలో 2,87,772 మంది చిన్నారులకు టీకాలు

జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. జిల్లాలో ఐదేళ్ల లోపు చిన్నారులు 2,93,536 మంది ఉండగా, వారిలో 2,87,772 మందికి సిబ్బంది పోలియో చుక్కలు వేసి 98.02 శాతం లక్ష్యం పూర్తి చేశారు. ఇందుకోసం 2,396 పోలియో బూత్‌లతోపాటు 65 మొబైల్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్ తదితర రద్దీ ప్రదేశాల్లోనూ సిబ్బంది చిన్నారులను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేశారు.

నేడు, రేపు ఇంటింటికీ వెళ్లి..

పోలియో చుక్కలు వేయించుకోని మిగిలిన చిన్నారులకు సోమ, మంగళ వారాల్లో వైద్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి టీకాలు వేయనున్నారు. ఇలా 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు.

బూత్ కమిటీలు తటస్థ ఓటర్లను ఆకర్షించాలి



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: బూత్ కమిటీల అధ్యక్షులు, సభ్యులు క్షేత్రస్థాయిలో తటస్థ ఓటర్లను ఆకర్షించాలని, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచించారు. పొదలకూరులోని పీవీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం సర్వేపల్లి నియోజకవర్గ స్థాయి బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశం వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలతారెడ్డితో కలిసి మంత్రి కాకాణి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలని సూచించారు. టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ అభ్యర్థి ఎవరైనా మనకు సంబంధం లేదని, సర్వేపల్లిని అభివృద్ధి వైపు నడపించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో ఇంత పెద్దఎత్తున భూములు, ఇళ్ల స్థలాల పంపిణీ, మౌలిక సదుపాయాల కల్పన జరగలేదన్నారు.

మీరే పార్టీ సైన్యం

సర్వేపల్లిలో ఉన్న 284 బూత్‌లలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే మన సైన్యమని మంత్రి కాకాణి పేర్కొన్నారు. నాకున్న అతిపెద్ద బలం మీరేనని, క్షేత్రస్థాయిలో ఎంతబాగా పనిచేస్తే సర్వేపల్లికి అంత మంచి పేరు వస్తుందన్నారు. మన ప్రత్యర్థికి టికెట్ వస్తుందో రాదో కూడా తెలియదని, సానుభూతికి ఓట్లు రాలవని, ప్రజలకు సేవ చేస్తేనే ఓట్లు వేస్తారని తెలిపారు. టీడీపీ ప్రజల్లోకి వెళ్లే పరిస్థితిలో లేదన్నారు. టీడీపీకి ఓటేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలను తీసుకువచ్చి ప్రజలను వేధిస్తారని తెలిపారు. సమావేశంలో ఏపీ డెయిరీ కోఆపరేటివ్ ఫెడరేషన్ కమిటీ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, ఐదు మండలాల జేసీఎస్ కన్వీనర్లు బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, మందల వెంకటశేషయ్య, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, తలమంచి సురేంద్రబాబు, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నిర్మలమ్మ, వాకాటి శ్రీనివాసులురెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, హరగోపాల్‌రెడ్డి, పెదమల్లు రమణారెడ్డి, కోనం చినబ్రహ్మయ్య పాల్గొన్నారు.

అభివృద్ధే నా మొదటి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

కందుకూరు: కందుకూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా, ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ అన్నారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తాను పుట్టి పెరిగిన ప్రాంతానికి సేవ చేయాలనే ఉద్దేశంతోనే కందుకూరుకు వచ్చానన్నారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావుల సహకారంతోనే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తనకు సహకరించడం లేదనే వార్తల్లో నిజం లేదని, వారు అన్నివిధాలా తనకు సహకరిస్తున్నారని స్పష్టం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందని కుటుంబం ఈ రాష్ట్రంలో లేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి పరిస్థితులు ఉండేవో తాను ప్రత్యక్షంగా చూశానని, వ్యాపార వర్గాలు భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితి ఉండేది గుర్తుచేశారు. అన్నివర్గాల ప్రజలకు నిలుస్తూ నియోజకవర్గంలో ప్రశాంత వాతారణానికి కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి రామాయపట్నం పోర్టు తీసుకురావడం వల్ల 19 వేల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. నియోజకవర్గంలో యువతకు ఉద్యోగాలు రావాలన్నా, అభివృద్ధికి బ్రేకులు పడకుండా ముందుకు సాగాలన్నా వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫి, జేసీఎస్ కోఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుర్రా మధుసూదన్‌యాదవ్

సృజనాత్మకత కలిగిన సాహిత్యం శాశ్వతం



ప్రముఖ కవి యాకూబ్‌ను సన్మానిస్తున్న నందమూరి లక్ష్మీపార్వతి తదితరులు


- ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి

నెల్లూరు(బృందావనం): సృజనాత్మక సాహిత్యమే శాశ్వతమని, కవులు, కవయిత్రులు ఆ దిశగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు నందమూరి లక్ష్మీపార్వతి సూచించారు. నెల్లూరు పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్‌లో ఆదివారం 'చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్' ఆధ్వర్యంలో జరిగిన 'అక్షరోత్సవం' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లాయర్ పత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 'కవి సంగమ' ఉద్యమ సారథి, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కవి యాకూబ్‌కు 'చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్' తొలి ప్రధాన అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపార్వతి మాట్లాడుతూ ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా ప్రఖ్యాతి చెందిన తెలుగు భాష ఏనాటికీ మృతభాష కాదని, ఇది అమృతభాష అని పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తోందన్నారు. తన ఫౌండేషన్ పేరుతో చిన్ని నారాయణరావు కవులను ప్రోత్సహిస్తుండడం అభినందనీయమని, చిన్ని నారాయణరావు 'కవిరాజు' అని ఆమె ప్రశంసించారు. తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ కవులకు మరింత ప్రోత్సాహాన్నిస్తూ జయప్రదంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అవార్డు గ్రహీత యాకూబ్, శ్రీరామకవచం సాగర్, బీరం సుందరరావు మాట్లాడుతూ కవులు సమాజహితం కోరేవారు కావాలని, మనిషిని మనిషిగా గుర్తించాలనే సందేశాన్ని చిన్ని నారాయణరావు తన 'బ్రతుకొక ఉత్సవం' కవితా సంపుటిలో వివరించారని ప్రశంసించారు. అనంతరం ప్రముఖ సాహితీవేత్తలు కంత బంగార్రాజు, కలిమిశ్రీ (విజయవాడ)లకు పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తొలుత జరిగిన కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, కవయిత్రులు మద్దూరి శ్రీనివాసులు, ఏటూరి నాగేంద్రరావు, అవ్వారు శ్రీధర్‌బాబు, నల్లు రమేష్, గోవిందరాజు సుభద్రాదేవి, ఎస్వీఎస్ నాగగాయత్రి, వాయుగుండ్ల శశికళ, సయ్యద్ నజ్మా, బొగ్గరపు రాధాకృష్ణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని కళాంజలి అనంత్, దువ్వూరి బెనర్జీ, హరనాథ్, శివకుమార్‌రెడ్డి, ఉపేంద్ర పర్యవేక్షించారు.

తేలని బొల్లినేని 'పంచాయితీ'

- నెల్లూరులో చంద్రబాబు సభకు డుమ్మాకొట్టిన బొల్లినేని వర్గీయులు
- అధినేత ఆగ్రహంతో ఉన్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం
- కాకర్లతో రాజీకి ససేమిరా అంటున్న బొల్లినేని వర్గీయులు

ఉదయగిరి: టీడీపీ ఉదయగిరి నియోజకవర్గ టికెట్ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావును కాదని చంద్రబాబు ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్‌కు ఇవ్వడంతో బొల్లినేని, అతని వర్గీయులు గత పది రోజులుగా తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. అధిష్టానం తన ప్రకటనను వెనక్కి తీసుకుని టికెట్ మార్చకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపిస్తామని, కాకర్లకు సహకరించేది లేదని బొల్లినేని బహిరంగంగా ప్రకటించారు. దీంతో పార్టీలో రాజుకున్న వివాదం, క్యాడర్‌లో తీవ్ర ఆందోళన ఇంకా కొనసాగుతున్నాయి. బొల్లినేని పంచాయితీ తేలకపోవడం, నెల్లూరులో చంద్రబాబు సభకు బొల్లినేని వర్గీయులు డుమ్మా కొట్టడంతో ఆయన తీరుపై అధిష్టానం కూడా తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.



బొల్లినేనికి దొరకని అపాయింట్‌మెంట్

గత వారం రోజులుగా చంద్రబాబును కలిసేందుకు బొల్లినేని చేస్తున్న ప్రయత్నాలు సఫలం కావడం లేదు. ఉదయగిరిలో అనుచరుల సమావేశం తర్వాత చంద్రబాబును కలిసి టికెట్ ఓకే చేసుకుని వస్తానని చెప్పిన 12 గంటల లోపే కాకర్ల పేరు ప్రకటించడంతో బొల్లినేని షాక్‌కు గురయ్యారు. అనంతరం చంద్రబాబును కలిసేందుకు ప్రయత్నం చేసినా వీలు కాలేదు. చంద్రబాబే బొల్లినేనికి ఫోన్ చేసి పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని చెప్పినా ఫోన్ కట్ చేసినట్లు తెలుస్తోంది. అనంతరం బొల్లినేని కలిగిరిలో గత నెల 28వ తేదీన ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి తనకు జరిగిన అన్యాయాన్ని కార్యకర్తలకు వివరించి చంద్రబాబును కలిసి తాడోపేడో తెల్చుకుని వస్తానని ప్రకటించారు. తర్వాత తమ అధినేతను కలిసే ప్రయత్నం చేస్తున్నా అవకాశం రావడం లేదు. ఉద్దేశపూర్వకంగా అపాయింట్‌మెంట్ లేట్ చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. క్యాడర్‌లో ఉన్న ఆగ్రహావేశాలను తగ్గించి బొల్లినేనిని తన దారిలోకి తెచ్చుకోవాలని చంద్రబాబు వ్యూహంగా ఉన్నట్లు కొంతమంది ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. సోమ, మంగళ వారాల్లో బాబు అపాయింట్‌మెంట్ ఇచ్చే అవకాశం ఉందని బొల్లినేని వర్గీయులు చెబుతున్నారు. నెల్లూరులో జరిగిన చంద్రబాబు సభకు బొల్లినేని తన అనుచరులు రాకుండా అడ్డువేయడంపై కూడా అధినేత ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. మొత్తమ్మీద ఉదయగిరి టీడీపీ టికెట్ వివాదం ఇప్పట్లో పరిష్కారమయ్యే సూచనలు కనిపించడం లేదు. ఈ వివాదం ఏ పరిణామాలకు దారితీస్తోందోననే భయం కూడా టీడీపీ క్యాడర్‌లో నెలకొంది.

క్లుప్తంగా

న్యాయశాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా సురేష్‌బాబు

నెల్లూరు(లీగల్): జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా వై సురేష్‌బాబు ఎన్నికయ్యారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘ ఎన్నికలను ఆదివారం నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణలోని సంఘ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో సురేష్‌బాబు తన సమీప అభ్యర్థి చక్రవర్తిపై 47 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా దీపక్ తన సమీప అభ్యర్థి గిరిబాబుపై 30 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 324 మంది ఉద్యోగులకు గాను, 288 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా జనరల్‌సెక్రటరీ, వైస్ ప్రెసిడెంట్, అసోసియేట్ ప్రెసిడెంట్, కోశాధికారి, జాయింట్ సెక్రటరీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

వెంకటాచలం: పట్టపగలే ఇంట్లోకి ప్రవేశించి మహిళ మెడలోని బంగారు సరుడును గుర్తుతెలియని వ్యక్తి అపహరించుకెళ్లిన ఘటన మండలంలోని ఎర్రగుంటలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. ఎర్రగుంట గ్రామానికి చెందిన లూర్దు మేరీ ఇంట్లో ఒంటరిగా ఉండగా, గుర్తుతెలియని వ్యక్తి గోడ దూకి వచ్చి ఆమె మెడలోని ఆరు సవర్ల బంగారు సరుడును లాక్కుని పరారయ్యాడు. మహిళ గట్టిగా కేకలు వేసినా చుట్టుపక్కల వారు వచ్చేలోగానే పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



దుర్గయ్య మృతదేహం

వరికుంటపాడు: బైక్ అదుపుతప్పడంతో యువకుడు మృత్యువాత పడిన ఘటన మండలంలోని గొల్లపల్లె సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని కాంచెరువు ఎస్టీ కాలనీకి చెందిన జయంపు దుర్గయ్య(25) తోటల చెరువుపల్లిలోని మామిడితోట వద్ద కాపలాదారుడిగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్లి తిరిగి గ్రామానికి వస్తున్న క్రమంలో గొల్లపల్లె సమీపంలో బైక్ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. దుర్గయ్య మృతితో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. స్థానికుల సమాచారంతో ఎస్సై కే తిరుపతయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి




సభలో అభివాదం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు


నెల్లూరు(వేదాయపాళెం): సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని నవ్యాంధ్ర మన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులుమాదిగ డిమాండ్ చేశారు. నగరంలోని కొండాయపాళెం గేట్ సెంటర్‌లో మన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగల రాజకీయ గర్జన సభను ఆదివారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ భవన్ నుంచి కొండాయపాళెం గేటు సెంటర్ వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మాదిగలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎంతో వెనుకబడి ఉన్నారన్నారు. మాదిగలు అన్ని రంగాల్లో రాణించాలంటే ఎస్సీ వర్గీకరణతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలోని దళిత వాడలకు శ్మశానవాటికల ఏర్పాటుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎకరా స్థలాన్ని కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మాదిగ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని, డప్పు కళాకారుల పింఛన్‌ను రూ.5 వేలకు పెంచాలని, జిల్లా కేంద్రంలో జగ్జీవన్‌రావు భవన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిసపోగు శ్రీనివాసులు మాదిగ, మన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళాధ్యక్షురాలు పల్లాల సునీత, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరి రత్నం మాదిగ, ఎమ్మార్పీఎస్ నేతలు సగిలి రమణయ్య, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 140
లేయర్ (లైవ్)	: 70
బ్రాయిలర్ చికెన్	: 244
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 270
లేయర్ చికెన్	: 120



పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.65
పండ్లు	: రూ.25

బడుగుల జీవితాల్లో వెలుగులు

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ కూడా అందిస్తోంది. తెలుగుదేశం హయాంలో నెలకు 50 యూనిట్ల వరకే ఉచిత విద్యుత్ ఉండేది. తర్వాత దానిని 100 యూనిట్లకు పెంచినా సక్రమంగా అమలు చేయలేదు. నేడు ఆ పరిస్థితుల్లేవు.


ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్

- ధోబీ ఘాట్లకు వంద శాతం రాయితీ
- గోల్డ్ స్మిత్, ఎంబీసీలకు 100 యూనిట్ల వరకు ఫ్రీ
- ల్యాండ్రీలు, నాయీబ్రాహ్మణులకు 150 యూనిట్లు
- ఆక్వా రైతులకు అండగా ప్రభుత్వం

జిల్లాలో..

ఉచిత సర్వీసులు **1,92,161**

ప్రతి నెలా యూనిట్ల వినియోగం : **14.46** మిలియన్లు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఎస్సీ, ఎస్టీల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ఇస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 1,83,966 మంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది.

భారమైనా..

చేతి వృత్తులు చేసుకునే వారికి ఉచిత విద్యుత్ ఇస్తుండటంతో ప్రతి నెలా ప్రభుత్వంపై రూ.14 కోట్లకు పైగా భారం పడుతోంది. అయినా వెనుకంజ వేయకుండా విద్యుత్ సంస్థలకు నగదు చెల్లిస్తూ, వారికి అండగా నిలుస్తోంది. ధోబీ ఘాట్లు, స్వర్ణకారులు, చేనేతకారులు, ల్యాండ్రీ షాపులు, నాయీబ్రాహ్మణులు, ఎస్సీ, ఎస్టీలతో పాటు అత్యంత వెనుకబడినవారు (మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాస్)లకు ఉచితంగా విద్యుత్‌ను అందజేస్తోంది. గత టీడీపీ పాలనలో ఆక్వా రైతులకు యూనిట్‌కు రూ.2.85 పైసలకు విద్యుత్ ఇస్తుండగా అదే నేటి వైఎస్సార్‌సీపీ పాలనతో యూనిట్‌ను రూ.1.50 పైసలకే అందిస్తోంది. ఉచిత విద్యుత్, సబ్సిడీ రూపంలో సంవత్సరానికి సుమారు రూ.169 కోట్లను ఈ ప్రభుత్వమే భరిస్తోంది.

వీరికి ఇలా..

గోల్డ్ స్మిత్ (స్వర్ణకారులు), ఎంబీసీలకు నెలకు 100 యూనిట్లు, నాయీ బ్రాహ్మణులు, ల్యాండ్రీలకు నెలకు 150 యూనిట్ల వరకు విద్యుత్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. ధోబీఘాట్లకు అయితే పూర్తి ఉచితం. ఇక పవర్ లూమ్స్‌కు 50 శాతం రాయితీపై ఇస్తున్నారు.

ఉచిత సర్వీసులిలా..

ఎస్టీ	53,092
ఎస్సీ	1,30,874
ఆక్వా	7,123
హ్యాండ్‌లూమ్స్	290
నాయీబ్రాహ్మణ	446
గోల్డ్‌స్మిత్	293
పవర్‌లూమ్స్	28
ధోబీఘాట్లు, లాండ్రీలు	9
ఏబీసీ	6

ఉపశమనం కలిగింది



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి గిరిజన కుటుంబాల కోసం 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇవ్వడంతో ఎంతో ఉపశమనం కలిగింది. గతంలో టీడీపీ వారు 100 యూనిట్ల వరకే ఇచ్చేవారు. మాకు నెలకు 100 యూనిట్లు దాటుతుంది. దీంతో కరెంట్ బిల్లు అధికంగా వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల నేడు బిల్లు చెల్లించే బాధ తప్పింది.

– మరమేని సుశీలమ్మ, ఎస్టీ లబ్ధిదారు, గాంధీగిరిజన కాలనీ, నెల్లూరు

ప్రోత్సాహకంగా ఉంది



హెయిర్ కటింగ్ షాపులు నిర్వహించుకునే నాయీ బ్రాహ్మణులకు నెలకు 150 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందజేస్తున్నారు. గతంలో బిల్లులు చెల్లించేవాడిని. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. మాలాంటి వారికి ఎంతో ప్రోత్సాహకంగా ఉంది.

– రుద్రకోట అరవింద్, నాయీబ్రాహ్మణుడు,ఇందుకూరుపేట

భారం తగ్గించారు



కరోనా కారణంగా స్వర్ణకారుల పరిస్థితి ఆశాజనకంగా లేదు. దీనికి తోడు బంగారు ఆభరణాలు తయారు చేసే కటింగ్ మెషీన్లు ఎక్కువ కావడంతో మాలాంటి వారికి పనులు తక్కువగా ఉన్నాయి. స్వర్ణకారులకు 100 యూనిట్ల వరకు ఎలాంటి విద్యుత్ బిల్లులు లేకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయడంతో కొంత భారం తగ్గింది. గతంలో ఏ నాయకుడు చేతివృత్తుల వారిని పట్టించుకున్న పాపాన పోలేదు.

– బాలిశెట్టి రమేష్, స్వర్ణకారుడు, నెల్లూరు

సంతోషంగా ఉంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎస్సీ, ఎస్టీలతోపాటు చేతి వృత్తుల వారికి విద్యుత్ బిల్లులు భారం కాకుండా సీఎం జగన్ చర్యలు తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఆయన పాలనలో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరింది.

– గుండ్లూరు విజయ్‌కుమార్, నాయీబ్రాహ్మణుడు, కలువాయి

దరఖాస్తు చేసుకోవచ్చు



బడుగు, బలహీన వర్గాలు, చేతివృత్తుల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణీత పరిమితి వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఎంబీసీలు, ఎస్సీ, ఎస్టీ, చేతివృత్తుల వారు దరఖాస్తు చేసుకుంటే అర్హతలు పరిశీలించి మీటర్లు ఏర్పాటు చేయిస్తాం.

– వీ విజయన్, ఎస్‌ఈ,ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ నినాదం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



ఉమ్మారెడ్డిగుంటలో ప్రచారం చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ప్రజాసంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నినాదమని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 21వ డివిజన్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మారెడ్డిగుంటలోని వినాయక గుడి ప్రాంతం నుంచి ఇంటింటి ప్రచారాన్ని ఆదాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా పక్కా ప్రణాళికతో ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న సీఎం వైఎస్ జగన్‌ను రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఇంటికి వెళ్లి ఎంపీ పరామర్శించారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఉమ్మారెడ్డిగుంట ప్రాంతంలోని పల్స్‌పోలియో కేంద్రాన్ని ఎంపీ ఆదాల సందర్శించారు. చిన్నారులకు పోలియో చుక్కలను స్వయంగా వేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పొట్లూరు స్రవంతి జయవర్ధన్, నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, క్లస్టర్–2 అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాతపాటి పుల్లారెడ్డి, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, స్థానిక డివిజన్ నాయకులు వెంగళ్‌రెడ్డి, స్వర్ణ మల్లికార్జున్, వెంకటరత్నం, కృష్ణారెడ్డి, సాయన్న, పెంచలరెడ్డి, రాజారెడ్డి, మాల్యాద్రి, బుజ్జన్న, గురుస్వామి, సతీష్, ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, రైల్వే బోర్డ్ సభ్యులు స్వర్ణా వెంకయ్య, మత్రిపాడు జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి



సోషల్ మీడియా సభ్యులతో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలనను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా దుష్ప్రచారాలతో బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని, వాటిని వైఎస్సార్సీపీ సోషల్ మీడియా సభ్యులు సమర్థవంతంగా తిప్పికొట్టాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బ్రాహ్మణపల్లిలోని ఎమ్మెల్యే మేకపాటి నివాసంలో ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికగా సమాజంలో జరుగుతున్న మంచిచెడులను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రచార బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక సాధికారత

- మాలమహానాడు రాష్ట్రాధ్యక్షుడు దాసరి శివాజీ
- 200 కుటుంబాలతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన దాసరి శివాజీ, మహిళలు, యువతతో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరగాలన్నా, సామాజిక సాధికారత సాకారం కావాలన్నా వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని మాలమహానాడు రాష్ట్రాధ్యక్షుడు దాసరి శివాజీ అన్నారు. ఆదివారం ఆయనతో పాటు యువత, మహిళలు కలిపి సుమారు 200 కుటుంబాలు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. పట్టణంలో ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో దాసరి శివాజీతో పాటు యువతకు పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాజకీయ పదవుల్లోనూ అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ సామాజిక సాధికారతకు కృషి చేస్తున్నారన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో విజయవాడలో 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం దాసరి శివాజీ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మాలమహానాడు మద్దతు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎస్సీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనతో ఆర్థిక భరోసా

- నగర నియోజకవర్గ సమన్వయకర్త ఎండీ ఖలీల్‌అహ్మద్



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎండీ ఖలీల్‌అహ్మద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలోని అన్ని వర్గాల్లోని పేదలకు సంక్షేమ పథకాలను అమలు చేసి ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్ అన్నారు. నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురం, గాంధీ గిరిజనకాలనీ, తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు పొందిన 140 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చేపట్టిన అభివృద్ధిని నగర ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. నగర ఎమ్మెల్యే అనిల్ మైపాడు రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించి ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారని తెలిపారు. నూతనంగా పెన్నా బ్రిడ్జి నిర్మాణం, భగత్ సింగ్ కాలనీ వద్ద పెన్నా ముంపు నుంచి రక్షణకు రిటైనింగ్ వాల్, ముత్తుకూరు రోడ్డు వద్ద ఫ్లైఓవర్, పార్కుల నిర్మాణం, తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జగనన్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేశారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఇంటింటికి చేరడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజాసేవ చేసేందుకు జగనన్న తనకు ఒక అవకాశం ఇచ్చారని, నగర ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ సఫియాబేగం, కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యులు షేక్ జమీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు బాగి వెంకటరమణ, వెంగళ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.